క్లుప్తంగా

నంద్యాల విద్యార్థిని ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): సీవీ రామన్ ఒలంపియాడ్ స్టేట్ లెవెల్ పోటీల్లో నంద్యాలకు చెందిన గురురాజ విద్యార్థి పి.సరయూ గోల్డ్ మెడల్ సాధించిందని విద్యాసంస్థల అధినేత షేక్షావలి రెడ్డి, మౌలాలిరెడ్డి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 4న నిర్వహించిన సీవీ రామన్ మ్యాథ్స్ అండ్ సైన్స్ ఒలంపియాడ్ అవార్డు ఫెస్టివల్‌లో 5వ తరగతి విద్యార్థిని సరయూ తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంకు సాధించి గోల్డ్ మెడల్ అందుకోగా సుచిర్ ఇండియా వ్యవస్థాపకులు లయన్ కిరణ్ అభినందించారని వివరించారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం


అభిషేకం చేస్తున్న ఉత్తరాది మఠాధిపతి

నంద్యాల వ్యవసాయం: అతిప్రాచీనమైన సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ ప్రతి హిందువూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని జగద్గురువు మధ్వాచార్య మూల మహా సంస్థానం 1008వ ఉత్తరాది మఠాధిపతి శ్రీసత్యాత్మతీర్థశ్రీపాద స్వామి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా భైర్మల్ వీధిలోని ఉత్తరాధి మఠం వేంకటేశ్వర, ఆంజనేయ స్వామి ఆలయాల్లో మూల విరాట్‌కు అభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ, ఆంజనేయ స్వామికి సింధూర అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. పట్టణ మధ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సుధీంద్రాచార్యులు, రాఘవేంద్రాచార్యులు, రఘురామశర్మ, వినయ్, న్యాయవాది దుర్గాప్రసాద్, పవన్ శర్మ పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టులపై అడ్మిన్లదే బాధ్యత

దొర్నిపాడు:సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వాట్సప్ గ్రూపుల్లో వివాదాస్పద పోస్టులకు అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఆయన శుక్రవారం వాట్సప్ అడ్మిన్లకు నోటీసులు జారీ చేశారు. గ్రూపులోని సభ్యులు రాజకీయంగా, మత పరంగా ఒకరినొకరు విద్వేషాలు, రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టరాదని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యేక ప్రార్థనలు

చాగలమర్రి: పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారం చేసే ప్రార్థన వెయ్యి శుక్రవారాలకు సమానమని చాగలమర్రి ఖిలా మస్జీద్ ఇమాం మౌలానా అబ్దుల్ సలాం పేర్కొన్నారు. రమజాన్ మాసంలోని చివరి శుక్రవారం సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలను ఉద్దేశించి ఖుద్బా ద్వారా శుక్రవారం ప్రాశస్త్యాన్ని వివరించారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న జనరల్ మర్చంట్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల వ్యవసాయం: కిరాణా, మండి వ్యాపారాలు చేసుకునే ఆర్య వైశ్యులకు చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రిటైల్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డగాళ్ల మల్లికార్జున, హోల్‌సేల్ జనరల్ మర్చంట్స్ అధ్యక్షుడు పాలూరు కృష్ణాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రిటైల్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల రావులపాలెంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు కిరాణా వ్యాపారస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆర్యవైశ్యులు కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారని ఆరోపించడం దుర్మార్గమన్నారు. క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

గోస్పాడు: రాబోవు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని ఎం.చింతకుంట్ల, జూలేపల్లె, పసరపాడు గ్రామాల్లో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

ఉయ్యాలవాడ : ధార్మిక ఉపన్యాసాలు, ఆధ్యాత్మికతతో మానవునికి మానసిక ప్రశాంతత లభిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి భక్తులకు వివరించారు. మండలంలోని అల్లూరు గ్రామ జనార్దన స్వామి ఆలయంలో ఈ నెల 2 నుంచి ప్రారంభమైన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, ధార్మిక ప్రవచనలు శుక్రవారం ముగిశాయి. ఆలయ ధర్మకర్త ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, సభ్యులు శివరామ సుబ్బయ్య, బుడ్డా శివమోహన్‌రెడ్డి, ఆరికట్ల నారాయణమ్మ పాల్గొన్నారు.

పల్లె గడపన పాలన

- ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు
- గ్రామాల్లో లక్షలాది రూపాయలతో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ల నిర్మాణం
- గాంధీజీ కలలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్



ఎం.కృష్ణాపురంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు



గోస్పాడు: గతంలో ఏ చిన్న పని పడినా మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఇక ఒకరోజులోనే పనులు కాకపోతుండటంతో పలుమార్లు తిరిగి చేయించుకోవాల్సి వచ్చేది. దీంతో ప్రజలకు శ్రమ, వ్యయంతో పాటు పనులు కోల్పోయేవారు. ఆ అవస్థలను గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి అనుబంధంగా రైతు భరోసా కేంద్రం, పశు సంవర్ధక తదితర శాఖల సేవలన్నీ గ్రామంలోనే అందేలా చర్యలు చేపట్టారు. అలాగే చిన్నపాటి జబ్బుకు కూడా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పల్లెలోనే సకల వసతులతో కూడిన ఆధునిక వైద్య సేవలతో పాటు వైద్యులను అందుబాటులో ఉంచారు. దీంతో ప్రజలకు పాలన చేరువ కావడంతో అవస్థలు తీరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి సుమారు 500కు పైగా సేవలు అందుబాటులో ఉన్నాయి. అలాగే ప్రజలు గ్రామంలో అర్జీ అందజేసిన 72 గంటల్లోగా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్దేశించింది.దీంతో సేవలన్నీ పారదర్శకంగా, వ్యయప్రయాసలు లేకుండా పల్లెగడపన అందుతుండటంతో జనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కేటాయింపు ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యసేవలు అందించడంతో పాటు హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించేలా రూపకల్పన చేశారు. ఒక్కో సచివాలయ భవనా నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. మండలంలో 11 సచివాలయాలకుగాను ఆరు భవనాలు పూర్తి కాగా మరో ఐదు వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణానికి రూ.21.80 లక్షలు చొప్పున మంజూరు చేసి 10 భవనాలు నిర్మించారు. హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.17.50 లక్షలు చొప్పున 8 భవనాలు ఏర్పాటు చేశారు.

అన్నదాతలకు అండగా ఆర్బీకేలు..

రైతు భరోసా కేంద్రాల్లో అన్నదాతలకు విశేష సేవలందుతునన్నాయి. భూసార పరీక్షల నుంచి దిగుబడి విక్రయించే వరకు అన్ని అక్కడే అందుతున్నాయి. పంటల సాగులో రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు సిబ్బందిని నియమించారు. ఇక ప్రాంతం, నేల, వాతావరణం, భూసారం తదితర వాటికనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలి, మార్కెట్‌లో ధర ఎలా ఉంది తదితర వివరాలు తెలుసుకునేందుకు పలు రకాల పుస్తకాలను రైతులకు అందుబాటులో ఉంచారు. మండలంలో 10 ఆర్బీకేలు మంజూరు కాగా ఆరు భవనాలు పూర్తయ్యాయి.


నెహ్రూనగర్‌లో హెల్త్ క్లినిక్

అందుబాటులో వైద్యం..

ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువయ్యాయి. మండలానికి 8 హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా 5 భవన నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించారు. వీటిల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది నిత్యం వైద్య సేవలు అందిస్తున్నారు. మరో 3 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి.


సాంబవరంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం

ప్రజలకు అవస్థలు తప్పాయి



ఎన్నడూ లేని విధంగా గ్రామల్లోనే పాలన అందేలా చర్యలు చేపట్టడంతో అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కడికి వెళ్లనవసరం లేకుండా పోయింది. గతంలో చిన్న సర్టిఫికెట్‌కు కూడా ఎన్నో అవస్థలు పడ్డాం.ఇప్పుడ గ్రామం సచివాలయంలోనే అన్ని సేవలు అందేలా ప్రభుత్వం రూపకల్పన చేసింది. మాకు డబ్బు, సమయం ఆదా అవుతుండటంతో పాటు ఇబ్బందులు తప్పాయి.

– నాగేశ్వరరెడ్డి, రైతు సాంబవరం

సేవలన్నీ గ్రామాల్లోనే..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు సచివాలయాలు, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారు. వీటితో ప్రజలకు అవసరమైన సేవలను సత్వరంగా అందేలా సిబ్బందిని నియమించారు. సంక్షేమ పథకాల పర్యవేక్షణ, అమలు బాధ్యతను వీటికే అప్పగించారు. దాదాపు సేవలన్నీ గ్రామంలోనే అందుతున్నాయి.

– ఆర్థర్ సైమాన్, ఎంపీపీ, గోస్పాడు

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకంతో పాటు నిత్య పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి పుష్పాభిషేకం, మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుః కాల పూజలు చేపట్టారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నంద్యాల(సిటీ): పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలన్నారు. అనంతరం ప్రియాంక నగర్‌లో జరుగుతున్న పైప్ లైన్ పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

నాని గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి

ఆళ్లగడ్డ: రాబోయే ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి (నాని)ని మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపింకుందామని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక చైర్మన్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారెడ్డి అధ్యక్షతన పార్టీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నాని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించి ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్ ఉన్నారు.

వారిది అరాచకం.. మాది అభివృద్ధి


చింతలచెరువులో ప్రచారం చేస్తున్న అవంతిక రెడ్డి

చాగలమర్రి: నియోజకవర్గంలో ఎవరు దౌర్జన్యాలు, దోపిడీ, గుండాయిజం,అరాచకాలు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు.. టీడీపీ నాయకులు అరాచకాన్ని ఎంచుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ మాత్రం అభివృద్ధి, సంక్షేమం వైపు నిలిచిందని గంగుల అవంతిక రెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఎజెండాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని, తాము కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు మేలు చేస్తున్నామన్నారు. శుక్రవారం మండలంలోని చింతలచెరువు మజరాలైన కొలుముల పేట, మూడురాళ్లపల్లె గ్రామాల్లో స్థానిక నాయకులు బుచ్చు సుబ్రహ్మణ్యం, గణపతిరెడ్డి, హనుమంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డితో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ గోవిందయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, ఉప సర్పంచ్ ఓబులేసు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, వార్డు సభ్యుడు పగిడాల బాబు, మనోహర్‌రెడ్డి , నాయకులు సుమన్, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, మాజి ఎంపీటిసి నాగలక్ష్మమ్మ, మద్దిలేటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు


మహిళా కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

బొమ్మలత్రం/నంద్యాల టౌన్: కులం, మతం, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని, వందల పేజీల మేనిఫెస్టో రాసి, వందల హామీలు ఇచ్చి ఎన్నికల తరువాత వంచన చేసే పార్టీ టీడీపీ అని, తాము మాత్రం మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి సింగిల్ షీట్లో ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించామని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం పట్టణంలోని 13,16 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాఉడతూ నంద్యాలలో ఉన్న టీడీపీ నాయకులు ఏ ఒక్క రోజైనా ప్రజల వద్దకు వచ్చి సమస్యలు విన్నారా అని ప్రశ్నించారు.శారీరక వ్యాయామం కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తన దృష్టికి తేవడంతో పెద్ద చెరువు వద్ద రూ.35లక్షలతో జిమ్ పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కాలనీల్లో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. నంద్యాల చరిత్రలో ఒక్క శాశ్వతమైన పనినైనా టీడీపీ వారు చేయలేక పోయారని, మన అభివృద్ధి తరతరాలు నిలిచిపోయేలా చేపట్టామని వివరించారు. సంతోషాన్ని కొనసాగించుకునేందుకు జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మనందరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం మాడబోయిన సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర బెస్తసంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు కాల్వ సరస్వతి, విజయభాస్కర్‌రెడ్డి, ఆర్టీం కళాశాల చైర్మన్ మిద్దె శివరాం, జెఈఎస్ కన్వీనర్ దాల్మిల్ అమీర్, టైలర్ శివ, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ సుబ్బలక్ష్మయ్య, నాయకులు చిలకల గురునాథ్, గిద్దలూరు మధుసుధాకర్, శాంత కుమారి, దేవి, సుధీర్‌రెడ్డి, ప్రదీప్, చింత శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. నంద్యాలను జిల్లాగా మార్చడం, మెడికల్ కళాశాల, ఉర్దూ డిగ్రీ కళాశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ ఐటీఐ, తదితరాలను తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అమృతపథకం ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని గుంతనాల, ఏ.శివరాంపురం, బి.శివరాంపురం గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాజారెడ్డి, పుల్లారెడ్డి, సురేంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి, వేణుగోపాల్, సుబ్బరాయుడుగౌడ్, నాగేంద్రగౌడ్, ఎంపీపీ ప్రభాకర్ పాల్గొన్నారు.

సంతోషాన్ని కొనసాగించుకుందాం


రాజనగరంలో వృద్ధుడితో మాట్లాడుతున్న సారికారెడ్డి

శిరివెళ్ల: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఆ సంతోషాన్ని కొనసాగించుకోవాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుందామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సతీమణి గంగుల సారికారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పార్వతీపురం, బీవీఎస్ నగర్, రాజనగరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ వనికినిదిన్నె నుంచి రూ.3 కోట్లతో తారు రోడ్డు వేయించామని, రాజనగరంలో రూ.95 లక్షలతో సీసీరోడ్లు వేశామని చెప్పారు. సర్పంచులు దగడ రఘునాధరెడ్డి, తలారి జానకమ్మ, వైస్ ఎంపీపీ చీమల అనూష, నాయకులు రాజారెడ్డి, రమేష్, మాస్కాని ప్రసాదు, లాయర్ సుబ్బయ్య, రాధాకృష్ణ, లోకేశ్వరరావు, శంకర్, నరసింహ్మారెడ్డి, చిన్న ఉసేనిరెడ్డి, రాజా రెడ్డి పాల్గొన్నారు.

సొంత గూటికి చేరుకున్న 38వ వార్డు నాయకులు


మాజీ మంత్రి శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 38వ వార్డు నాయకులు, కార్యకర్తలు

నంద్యాల: ఇటీవల టీడీపీలో చేరిన 38వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మళ్లీ సొంత గూటికి చేరుకున్నారు. శుక్రవారం వార్డుకు చెందిన వడ్డె వెంకటేశ్వర్లు, జమాలయ్య, శ్రీకాంత్, విజయ్ కుమార్, శివ, సుబ్బరాయుడు, రాము, అరుణ్, లక్ష్మీదేవి, లక్ష్మి, సలీమా, మాణెమ్మ, మాబాషా, టైలర్ సురేంద్ర, రహంతుల్లా, నారాయణస్వామి, సుబ్బరాయుడుతో పాటు మరో 50 మంది మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే శిల్పా స్వగృహంలో శిల్పా మోహన్‌రెడ్డి, కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, 38వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రమణ, శేఖర్, చిరంజీవి పాల్గొన్నారు.

నంద్యాలలో అరుదైన శస్త్రచికిత్స

నంద్యాలటౌన్: పుట్టుకతోనే ఎముకలను తినేసే కన్జెనిటల్ కొలెస్టేమా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న వెంకట మనోజ్ (14)కు పట్టణంలోని మధుమణి నర్సింగ్ హోమ్‌లో విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించినట్లు డాక్టర్ మధుమణి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ పక్షవాతం సమస్యతో ఆసుపత్రికి వచ్చిన ముద్దనూరుకు చెందిన వెంకటమనోజ్ అనే బాలుడకి గురువారం త్రీడీ రీకన్‌స్ట్రక్షన్ సీటీ స్కాన్ ద్వారా కుడి చెవి చుట్టూ ఉన్న ట్యూమర్‌ను గుర్తించి..డాక్టర్ మణిదీప్, రోహిత్, మాధవితో కలిసి మోడిఫైడ్ రాడికల్ మాస్టాయిడెక్టమీ, టింపనో ప్లాసి, ఆశికులో ప్లాసి శస్త్రచికిత్సలు చేశామని చెప్పారు. సకాలంలో చికిత్స నిర్వహించడం వల్ల బ్రెయిన్ ట్యూమర్‌కు గురికాకుండా నివారించామని పేర్కొన్నారు.

ఫ్లాప్ షో!


ప్రజలు లేక వెలవెల బోయిన నిజం గెలవాలి పర్యటన

నంద్యాలటౌన్: స్కిల్ డెవలప్మెంట్ స్కాంలో ప్రజాధనాన్ని బొక్కిన బాబును న్యాయస్థానం జైల్లో పెట్టింది. తప్పు చేసి జైలుకు వెళ్లినా దాన్ని సానుభూతిగా మార్చుకుని ఓట్లు సంపాదించాలని కుయుక్తితో సాధారణ మరణాలను కూడా బాబు కోసమే అన్నట్లు షో చేస్తు నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో పర్యటన చేస్తు మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తున్నారు. పట్టణంలోని 34 వార్డు వెంకటాచలం కాలనీలో గాజుల అబ్దుల్ రహీం కుటుంబాన్ని, 13వ వార్డులో గురువ రాజు కుటుంబాన్ని శుక్రవారం ఆమె పరామర్శించారు. పట్టుమని పది నిమిషాలు కూడా ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడలేక పోయారు. కాగా భువనేశ్వరి పర్యటనలో టీడీపీ నాయకులు ఎవరికి వారే అన్న రీతిలో వ్యవహరించారు. 34వ వార్డులో ఏవీ సుబ్బారెడ్డి, ఎన్ఎండీ ఫరూక్‌లు ఎదురుపడినా మాట్లాడుకోకపోగా భువనేశ్వరి ప్రసంగం ప్రారంభం కాకముందే సుబ్బారెడ్డి వెళ్లిపోయారు. 13వ వార్డులో భూమా బ్రహ్మనంద రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ముక్తసరిగా పలకరించుకున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి పట్టణానికి వచ్చినా నాయకులు ప్రజలను రప్పించలేక పోయారని, కూటమి పార్టీలైన బీజేపీ, జనసేన నాయకులు హాజరుకాలేదు.

చోటా నాయకుల హల్‌చల్..

వెంకటాచలం కాలనీలో గాజుల అబ్దుల్ రహీం కుటుంబాన్ని పరామర్శించేందుకు భువనేశ్వరి వెంట ముఖ్యమైన నాయకులనే అనుమతిస్తామని ఆమె అనుచరులు చెప్పటంతో వార్డు ఇన్‌చార్జ్ షేక్ అహ్మద్ తదితరులు వారిపై ఆగ్రహంతో ఊగిపోయారు. క్షేత్రస్థాయిలో ఉండేది మేమే, మమ్మల్నే పంపకపోతే ఇన్ని ఏర్పాట్లు ఎందుకు? రేపు ఎన్నికల్లో మీరే వచ్చి ఇంటింటికీ తిరిగి ఓట్లు అడగండి అంటూ వారితో వాగ్వాదానికి దిగారు. మహిళా నాయకులను కనీసం పుష్పగుచ్ఛాలు ఇవ్వకుండా అడ్డుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


రాజకీయ పార్టీల నాయకుల సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జునరెడ్డి కోరారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నడుచుకోవాలని చెప్పా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పాటించి ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్ బాబు, హనుమంత నాయక్, చంద్రబాబు ఉన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రుద్రవరం రేంజ్ అటవీ అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. 'స్వచ్ఛత పక్వాడ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నల్లమల వెలసిన శ్రీ పావన లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం సమీపంలోని టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పేరుకు పోయిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను సేకరించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ కోసం భక్తులు ప్లాస్టిక్ వస్తువులు తీసుకు రావొద్దని కోరారు. డిప్యూటీ రేంజ్ అధికారులు మూర్తుజావలి, నాగేంద్ర నాయక్ ఉన్నారు.

సామాజిక న్యాయానికి ప్రతిరూపం జగ్జీవనరామ్


బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సెంట్రల్): రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయ సూత్రాలను స్వాతంత్రానికి ముందే ప్రజలకు పరిచయం చేసిన వైతాళికుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఆర్ఏఆర్ఎస్ సహ సంచాలకురాలు డాక్టర్ సరళమ్మ కొనియాడారు. శుక్రవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడీఆర్ మాట్లాడుతూ... జగ్జీవన్ రామ్ ఇండియా–పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా ఉన్నారని, స్వాతంత్ర సమరయోధుడుగాను, విశిష్ట పార్లమెంటేరియన్ గాను సేవలు అందించారని కీర్తించారు. ప్రధాన శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు వెంకటరమణమ్మ, జయలక్ష్మి, రాఘవేంద్ర చౌదరి, నరసింహులు వ్యవసాయ శాఖ అధికారులు, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): బలహీన వర్గాల అభ్యున్నతే బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామ పక్కీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కరరెడ్డి అన్నారు. శుక్రవారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు ఆయన సేవలను కొనియాడారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ అధ్యక్షతన నివాళులర్పించారు.

నంద్యాల(సిటీ): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేష సేవలు అందించిన బాబూ జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని విక్టోరియా రీడింగ్ రూం వద్ద ఉన్న జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నంద్యాల(వ్యవసాయం): స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఉప ప్రధానమంత్రిగా , బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా సమసమాజ స్థాపనకు విశేష కృషి గాంచిన బాబూ జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సూచించారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే పట్టణ మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరుడుపుల్లయ్య, జీవన్ రాజు, శ్రీనివాసులు, రామచంద్రుడు, జగదీష్, పుల్లన్న పాల్గొన్నారు.